ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కరీంనగర్
జిల్లా వార్తలు
5
బుధవారం 11 సెప్టెంబర్ 2024

డీసీసీ అధ్యక్ష పీఠం ఎవరికో?



- రేసులో ఆరుగురు
- రాష్ట్ర అధ్యక్షుడి నియామకంతో ఊపందుకున్న రాజకీయాలు
- మంత్రుల సిఫారసులే కీలకం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నియమించడంతో కాంగ్రెస్ జిల్లా రాజకీయాలు మళ్లీ ఊపందుకున్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షులను కూడా మార్చి కొత్త నాయకత్వానికి పగ్గాలు అప్పగించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడంతో ఆశావహుల్లో మళ్లీ కదలిక ప్రారంభమైంది. ి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూర్ శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు. శాసనసభ్యుడిగా నియోజక వర్గానికి ఎక్కువ సమయం కేటాయించాల్సిన అవసరం ఉందనే భావనతో ఆయనను మార్చ వచ్చని భావిస్తున్నారు. ఎమ్మెల్యేలకు జోడు పదవులు వద్దు అనుకుంటే తప్ప ఆయనను మార్చే అవకాశం లేదని, ఆయన నాయకత్వం లోనే జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలో పార్టీ విజయం సాధించిందనే అభిప్రాయం ఉంది. సత్యనారాయణ కూడా రెండు పదవుల్లో కొనసాగే కంటే ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడం ముఖ్య మని భావిస్తున్నారని, అందుకే జిల్లాకు కొత్త అధ్యక్షుడిని నియమిస్తారని పార్టీ నాయకులు అంటున్నారు.

సీనియర్ల ఆసక్తి

జిల్లా అధ్యక్ష పదవి రేసులో ప్రస్తుతం ఆరు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కిసాన్‌సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. కాంగ్రెస్‌లో సీనియర్ నాయకులుగా ఉన్న బొమ్మ శ్రీరాంచక్రవర్తి, ఆకారపు భాస్కర్ రెడ్డి 2019లోనే పార్టీని వీడి బీజేపీలో ఒకరు, బీఆర్ఎస్‌లో ఒకరు చేరారు. ఆ తర్వాత ఇటీవల వీరిద్దరు కాంగ్రెస్‌కు తిరిగి వచ్చారు. వీరిద్దరు కూడా డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. పార్టీని వీడి వెళ్లడం మైనస్‌గానే భావిస్తున్నా కాంగ్రెస్ హయాంలో బొమ్మ శ్రీరాంచక్రవర్తి టీపీసీసీ కార్యదర్శిగా, హౌస్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్‌గా, ఆకారపు భాస్కర్‌రెడ్డి కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేయడం కలిసి వచ్చే అంశాలుగా ఉన్నాయి. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కరీంనగర్ నియోజకవర్గం నుంచి పోటీచేసిన వెలిచాల రాజేందర్‌రావు డీసీసీ రేసులో ఉన్నారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఆయన తాను ఏ పదవిని కోరుకోవడం లేదని, పార్టీ అప్పగించిన ఏ బాధ్యతనైనా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నానని మీడియాలో ప్రకటించారు. ముందు డీసీసీ అధ్యక్ష పదవిని కోరుకున్న ఆయన ఈ విధంగా మాట్లాడడం రాజకీయంగా ఆసక్తి కలిగిస్తున్నా ఆయన పేరు కూడా పరిశీలనలో ఉంటుందని చెబుతున్నవారు కూడా ఉన్నారు. అధికారంలో లేనప్పుడు పార్టీని వీడకుండా కొనసాగిన తమకు అవకాశం కల్పించాలని పద్మాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్, పత్తి కృష్ణారెడ్డి కోరుతున్నారు.

సామాజిక వర్గాల వారీగా ప్రాధాన్యం

ఈనెల 15న ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల వారిగా నివేదికలు తెప్పించుకుంటారని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలతో సంప్రదింపులు జరిపి అధ్యక్షులను ఎంపిక చేస్తారని తెలిసింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉండగా ఉమ్మడి జిల్లా పరిధిలో ఎన్నికైన పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్ బాబు రాష్ట్ర మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిద్దరు కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో క్రియాశీల నేతలుగా ఉన్నారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడి ఎంపికలో వీరిద్దరి ప్రతిపాదనలకు ప్రాధాన్యం ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షుడిగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రాతినిధ్యం వహించారు. ఇటీవల జిల్లా నుంచి రెడ్డి సామాజికవర్గానికి చెందిన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సుడా చైర్మన్‌గా, బీసీ సామాజిక వర్గానికి చెందిన నేరెళ్ల శారద మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం డిసిసి అధ్యక్ష పదవికి పోటీపడుతున్న వారిలో ముగ్గురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు కాగా, బీసీ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు, వెలమ సామాజిక వర్గానికి చెందిన వారు ఒకరు ఉన్నారు. వీరిలో ఏ సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇస్తారో, ఎవరికి అధ్యక్ష పీఠం దక్కుతుంతో వేచిచూడాల్సిందే. ఉమ్మడి జిల్లా పరిధిలోని జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలతో కలుపుకొని అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యం దక్కేలా అధ్యక్షుల ఎంపిక ఉంటుందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

కరీంనగర్-హసన్‌పర్తి రైల్వే లైన్‌కు అనుమతులు ఇవ్వండి



రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖను అందిస్తున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 10: కరీంనగనర్-హసన్‌పర్తి రైల్వే లైన్‌కు నిర్మాణ అనుమతులు ఇవ్వాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కోరారు. మంగళవారం ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి లేఖను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్-హసన్‌పర్తి కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమైనందున నిర్మాణ పనులకు అనుమతి ఇవ్వాలన్నారు. కరీంనగర్ నుంచి హసన్‌పర్తి వరకు 61.8 కిలోమీటర్ల మేర నిర్మించే రైల్వే లైన్‌కు 1,415 కోట్ల వ్యయం అవుతుందన్నారు. రైల్వే బోర్డులో ఈ అంశం పెండింగ్‌లో ఉందని, తక్షణమే ఆమోదం తెలపాలని కోరారు. కొత్త రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. కరీంనగర్-వరంగల్ మధ్య వాణిజ్య సంబంధాలు పెరిగి ఆర్థిక వృద్ధికి తోడ్పతుందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయాల న్నారు. జమ్మికుంట స్టేషన్ వద్ద దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలని అధికారులను ఆదేశించాలని మరో లేఖ అందజేశారు. ఉప్పల్ రైల్వే స్టేషన్ అప్‌గ్రేడ్‌లో భాగంగా ప్లాట్‌ఫాం రైల్వేస్టేషన్ భవనాన్ని ఆధునీ కరించాలన్నారు. పార్కింగ్‌ను విస్తరించాలని, సోలార్ ప్యానెళ్లను అమర్చాలని, టికెట్ కౌంటర్ లగేజీ నిర్వహణ వ్యవస్థను మెరుగు పరచాలన్నారు.

నిండు కుండలా ఎల్‌ఎండీ

- ఇన్‌ఫ్లో పెరిగితే గేట్లు ఎత్తే అవకాశం



ఎల్‌ఎండీ గేజ్ లేవల్ వద్ద కనిపిస్తున్న నీటి నిల్వలు

తిమ్మాపూర్, సెప్టెంబరు 10: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశం పూర్తిస్థాయిలో నిండింది. అక్టోబరు 10న ఎల్‌ఎండీలో 24.034 టీఎంసీల సామర్థ్యానికి 5.432 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈసారి ఎల్‌ఎండీలోకి నీళ్లు వస్తాయా.. రావా.. అని అందరూ సందేహాలు వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఎగువన ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి మిడ్‌మానేరు ద్వారా కొంత నీటిని ఎల్‌ఎండీకి విడుదల చేశారు. ఈ నీటికితోడు భారీ వర్షాలు కురవడంతో నెల రోజుల వ్యవధిలోనే ఎల్‌ఎండీ పూర్తిస్థాయిలో నిండింది. మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి నీటి విడుదలను మంగళవారం పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం మోయతుమ్మెద వాగు ద్వారా 904 క్యూసెక్కులు, ఎగువన క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 1,101 క్యూసెక్కులు, మొత్తం 2,005 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తోంది. మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 309 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ఎల్‌ఎండీలో ప్రస్తుతం 24.034 టీఎంసీలకు 23.645 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



జలకళతో ఎల్‌ఎండీ

ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యానికి చేరుకుంది

- ఇరిగేషన్ ఈఈ నాగ భూషణం

లోయర్ మానేరు డ్యామ్ దాదాపు పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో తగ్గింది. వరద నీటిని నదిలోకి వదిలే పరిస్థితి లేదు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే పరిస్థితినిబట్టి వరద గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతాం.

పోస్టల్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

భగత్‌నగర్, సెప్టెంబరు 10: ప్రభుత్వ గుర్తింపు పొందిన హైస్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు పోస్టల్ శాఖ స్కాలర్‌షిప్‌లు అందించేందుకు దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరిండెంట్ కె శివాజి ఒక ప్రకటనలో తెలిపారు. దీన్‌దయాల్ స్పర్శ్ యోజన పథకం కింద ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదు వుతున్న విద్యార్థులకు సంవత్సరానికి ఆరు వేల రూపాయల చొప్పున స్కాలర్ షిప్‌లు అందజేస్తా మన్నారు. ప్రతి మూడు నెలలకోసారి 1,500 రూపాయలు అర్హులైన విద్యార్థులకు అందుతాయ న్నారు. ప్రతి తరగతిలో ఉత్తమ అకాడమిక్ రికార్డు ఉన్న పది మంది విద్యార్థులు మాత్రమే అర్హులని, ఆయా హైస్కూల్స్‌కు చెందిన విద్యార్థులు ఈ నెల 13వ తేదీ లోగా సమీప పోస్టాఫీసు, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో ఉంటాయన్నారు.

గురుకుల విద్యాలయాల్లో ఖాళీల భర్తీకి కౌన్సెలింగ్

గణేష్‌నగర్, సెప్టెంబరు 10: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. విటిజి సెట్, బీఎల్‌వీ సెట్ రాసి సీటు వచ్చి జాయిన్ కాని ఎస్సీ బాల, బాలికలు, ఎస్సీ ఆర్ఫాన్స్, సెమీ ఆర్ఫాన్స్, దివ్యాం గుకుల ప్రాధాన్యం ఇచ్చిన తర్వాత మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సీటు వచ్చిన కాపీ, హాల్ టికెట్, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, ఇతర పత్రా లతో ఈనెల 12న చింతకుంట గురుకుల పాఠశాలకు ఉదయం పది గంటల వరకు హాజరు కావాలన్నారు.



శాతవాహన యూవర్సిటి వద్ద ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు

ఏబీవీపీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ముట్టడికి యత్నం

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- లోపలికి వెళ్లేందుకు నాయకుల యత్నం
- అడ్డుకున్న పోలీసులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10: శాతవాహన యూనివర్సిటీలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం శాతవాహన యూనివర్సిటీ ఎదుట ధర్నా నిన్వహించి ముట్టడికి యత్నించారు. పోలిసులు వారిని అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సదర్భంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్, యూనివర్సిటీ నాయకులు రాష్ట్ర కార్య సమితి సభ్యుడు జెల్లపెల్లి అంజన్న మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ ప్రారంభ మైనప్పటి నుంచి సమస్యలతో కొట్టుమిటా డుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం యూనివర్సిటీలను విస్మరించిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్న శాతవాహన యూని వర్సిటీకి కనీసం రెగ్యులర్ వీసీని నియమించకపోవడం శోచనీయ మన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి విద్యాశాఖకు మంత్రిని నియమించాలన్నారు. శాతవాహన యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీ నియమించి నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని, ఖాళీలను భర్తీ చేయాలని, విద్యార్థులకు మెరుగైన హాస్టల్ వసతిని కల్పించాలని కోరారు. యూనివర్సిటీలో ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో అనేక రకాల అవకత కలతో విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌యూ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్య మాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విభాగ్ కన్వీనర్ అజయ్, రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ రంజిత్, జిల్లా కన్వీనర్లు పూ సాల విష్ణు, మాడవేణి సునీల్, బండి రాజశేఖర్, సామలపల్లి ప్రశాంత్, నగర కార్యదర్శులు బామండ్ల నందు, రాజు, సిద్ధార్థ, వరుణ్, హాస్టల్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్, ఉమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధు, శ్రీపతి, సాయితేజ, అజయ్ పాల్గొన్నారు.




ఆందోళనకారులను భుజాలపై ఎత్తుకెళ్తున్న కానిస్టేబుల్

నత్తనడకన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

- సుమారు రూ. తొమ్మిది కోట్లతో నిర్మాణం
- రెండేళ్లయినా పూర్తి కాని పనులు

హుజూరాబాద్, సెప్టెంబరు 10: పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రెండేళ్లు దాటినా పనులు పూర్తి కాలేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హుజూరాబాద్ పట్టణంలో పాత కూరగాయల మార్కెట్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా లేదనే ఉద్దేశ్యంతో బస్టాండ్ సమీపంలోని ఐబీ గెస్ట్‌హౌస్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించాలని ప్రతిపాదించారు. అందులో ఆర్డీవో కార్యాలయం ఉండగా, ఖాళీ చేయించి రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. దీనికి మొదటి విడతలో 4.5 కోట్లు విడుదలయ్యాయి. మిగితా 4.5 కోట్లకు ప్రతిపాదనలు పంపించగా, ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. సదరు కాంట్రాక్టర్ ఈ పనులను అతని వీలు ప్రకారమే పనులు చేపడుతున్నాడనే విమర్శలున్నాయి. హుజూరాబాద్ పట్టణ జనాభా రోజు రోజుకు పెరుగుతుండడంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఉంటే బాగుంటుందని మున్సిపల్ పాలకవర్గం ఆమోదించింది. రెండెకరాల స్థలంలో 102 కూరగాయల దుకాణాలు, 40 మటన్, ఫిష్ దుకాణాలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సదరు కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేశారు. బిల్లులు రానందుకే పనులు నిలిపివేశాడని తెలిసింది. ప్రస్తుతం కూరగాయల మార్కెట్ మున్సిపల్ సమీపంలో కొనసాగుతుండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్, ప్రజాప్రతినిధులు స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ సాంబరాజును వివరణ కోరగా నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించామని, అవి రాగానే పనులు పూర్తి చేయిస్తామన్నారు.



హుజూరాబాద్‌లో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్

మెరుగైన వైద్య సేవలందిస్తాం

- డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్



డాక్టర్ చంద్రశేఖర్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తామని డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూరాబాద్, జమ్మికుంట ఆసుపత్రుల్లో ఆపరేషన్ థియేటర్లు ఉన్నప్పటికి ప్రస్తుతం సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. త్వరలో అన్నిరకాల సిజేరియన్ ప్రసవాలు నిర్వహించేందుకు సిబ్బందిని నియమించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చొప్పదండిలో నూతన భవన నిర్మాణం పూర్తవగానే వంద పడకలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అందులో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ప్రసవాలతోపాటు ఇతర అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామన్నారు. హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన వారు ప్రసవాల కోసం కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి, వరంగల్ ఎంజీఎంకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఏర్పాట్లు చేసేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10: శాతవాహన విశ్వ విద్యాలయం (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఏఎల్) డిగ్రీ ఫస్ట్, సెకండ్, థర్డ్ ఇయర్ వైస్ ఎగ్జామ్ ఫీజు నోటిఫికేషన్ షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. విశ్వ విద్యాలయ పరిధిలోని విద్యార్థులు చదువుకునే కళాశాలకు వెళ్లి ఫీజు చెల్లించాలన్నారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థులు ఫస్ట్, సెకండ్ అండ్ థర్డ్ ఇయర్ ఫీజు నోటిఫికేషన్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని ఆయన సూచించారు.

ఇద్దరు దొంగల అరెస్టు

వేములవాడ రూరల్, సెప్టెంబరు 10: దొంగతనం జరిగిన 24 గంటల్లోగా నిందితులను పట్టుకున్నారు రూరల్ పోలీసులు. వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి మంగళవారం సాయంత్రం వివరాలను వెల్లడించారు. మల్లారం గ్రామం రాజానగర్‌కు చెందిన శ్రీరాముల శ్రీనివాస్ తన ఇంటికి కలర్ వేయడానికి వేములవాడకు చెందిన సందెల్లి అనీల్, సయ్యద్ అఫ్రోజ్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. కొన్నిరోజులుగా ఇంటికి కలర్ వేసే పని జరుగుతున్న క్రమంలో ఆదివారం శ్రీనివాస్ భార్యతో కలిసి బెజ్జంకికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని హ్యాండ్ బ్యాగ్ కనబడలేదు. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బ్యాగ్‌లో 25 గ్రాముల బంగారం ఉన్నట్లు ఫిర్యాదులో తెలిపాడు. విచారణ చేపట్టిన రూరల్ ఎస్సై మారుతీ ఇంటికి కొద్ది దూరంలో బ్యాగును కనిపెట్టారు. బ్యాగుకు కలర్ మరకలు ఉండడంతో ఆ కోణంలో దర్యాప్తు చేశారు. కలర్ వేసిన అనీల్, అఫ్రోజ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి బంగారం రికవరీ చేసి నిందితులను రిమాండుకు తరలించినట్లు ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి తెలిపారు. సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందరూ.. అంత్యక్రియలకు..

మృతుడి ఇంట్లో దొంగతనం

మల్యాల, సెప్టెంబరు 10: మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలు నిర్వహించడానికి కుటుంబ సభ్యులు వెళ్లగా కాసేపటికే బంధువుగా చెప్పుకున్న వ్యక్తి ఒకరు మృతుడి ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. కొండగట్టుకు చెందిన గౌరపల్లి లక్ష్మన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు మధ్యాహ్నం వైకుంఠధామానికి వెళ్లారు. అయితే ఇంటి వద్ద పనులు చేయడానికి కొందరు బంధువులు ఉన్నారు. అందులో కలిసి పోయిన ఓ వ్యక్తిపై అక్కడి వారందరికీ అనుమానం రాగ తాను కూడా బంధువునని చెప్పుకున్నాడు. అంత్యక్రియలు చేసి వచ్చే వరకూ తాను కూడా ఇక్కడే ఉంటానని పనులు చేసే అక్కడి వారికి సహకరించాడు. ఇంటి శుద్ధి పనులు అయ్యాక అతను ఇంట్లోకి వెళ్లగా కాసేపటికి కోతుల గుంపు ఇంట్లోకి వెళ్లింది. బయట ఉన్న వ్యక్తులు వాటిని తరమడానికి ప్రయత్నించడాన్ని గమనించిన సదరు వ్యక్తి ఇంట్లో నుంచి కోతులను తరుముతూ బయటకు వచ్చి పారిపోయాడు. దీంతో అనుమానం వచ్చి మిగతా బంధువులు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి మూడు బీరువాలు పగులగొట్టి అందులోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉండటాన్ని గమనించారు. అక్కడ ఉన్న సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. కోతులు రాకపోతే ఇంట్లో బంగారు ఆభరణాలు ఇతరత్రా ఎత్తుకెళ్లేవాడని స్థానికులు తెలిపారు. నిందితుడు ద్విచక్రవాహనంపై పారిపోయాడన్నారు.



ప్రమాదం జరిగిన బస్సు(ఫైల్)

మానని గాయం

సెప్టెంబరు 11.. కొండగట్టు ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన రోజు. ఆ బస్సులో ఉన్న వారంతా కొండగట్టు అంజన్నను దర్శించుకుని వస్తున్న వారే. పిల్లాపాపలతో కుటుంబ సభ్యులంతా కలిసి అంజన్న వద్ద మొక్కులు తీర్చుకుని ఇళ్లకు బయల్దేరాలని బస్సు ఎక్కి కూర్చున్నారు. బస్సు మొత్తం నిండుగా ఉంది. ఎవరి ముచ్చట్లలో వారు నిమగ్నమయ్యారు. కొండగట్టు నుంచి బస్సు దిగుతుండగా ఒక్కసారిగా అదుపుతప్పి లోయలో పడింది. అంతే అందులో ఉన్న ప్రయాణికులకు ఏం జరిగిందో తెలిసేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అప్పటి వరకు తమతో మాట్లాడిన కుటుంబ సభ్యులు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కన్నీటి పర్యంతం అయ్యారు. ప్రమాదంలో 67 మంది వరకు చనిపోయారు. ఇంకొందరు తీవ్ర గాయాలపాలైన ఇప్పటికీ లేవలేని స్థితిలో ఉన్నారు. ప్రమాదం జరిగిన రోజును గుర్తు చేసుకుంటూ క్షతగాత్రులు ఇప్పటికీ కన్నీటి పర్యంతం అవుతున్నారు. అత్యంత విషాధకర ఘటన జరిగి ఆరేళ్లు అవుతోంది.

- కొండగట్టు బస్సు ప్రమాదంలో 67 మంది మృతి
- నేటికీ కలిచివేస్తున్న ఘటన
- బాధితులకు అందింది అరకొర సాయమే

మల్యాల, సెప్టెంబరు 10: కొండగట్టు ఘాట్‌రోడ్డుపై జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదానికి నేటికి ఆరు సంవత్సరాలు. ఈ ప్రమాదంలోని ప్రయాణికుల హాహాకారాలు.. క్షతగాత్రుల ఆర్తనాదాలు బంధువులతో పాటు స్థానికులను నేటికీ కలచి వేస్తున్నాయి. ఆనాటి ప్రమాద గుర్తులు కలవరపెడుతూనే ఉన్నాయి. ఈ సంఘటన న దేశంలోనే అతిపెద్ద రహదారి ప్రమాదంగా నిలిచిపోగా.. సమారు 67 మంది వరకు మృత్యువాత పడ్డారు. ప్రమాదానికి కారణమైన ఈ ఘాట్‌రోడ్డుపై దిద్దుబాటు చర్యలు ఇప్పటి వరకు నామమాత్రమే.. ఘాట్‌రోడ్డు అలైన్‌మెంట్ సరిగా లేదని నిపుణులు పదేళ్లుగా సూచిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో 2018 సెప్టెంబరు 11న కొండగట్టు గుట్టపై నుంచి ఆర్టీసీ బస్సు దిగుతుండగా అదుపుతప్పి లోయలో బోల్తాపడి 67మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 45మంది వరకు క్షతగాత్రులుగా మిగిలారు. ఈ ప్రమాదం అనంతరం ప్రస్తుత ఘాట్ రోడ్డును మూసివేశారు. వాహనాల రాకపోకలను నిషేదించారు. ఘాట్ రోడ్‌కు కొంతమేర మరమ్మతులు, కొన్ని చోట్ల రక్షణగోడల నిర్మాణం, స్పీడ్‌బ్రేకర్ల మరమ్మతులు మాత్రమే చేపట్టారు. శాశ్వతంగా ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు శూన్యం. గతంలోనూ ఈ ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు 150మందికి పైగానే భక్తులు దుర్మరణం చెందగా, వందలాదిగా గాయాలపాలయ్యారు. అయినప్పటికీ, ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు అంతంత మాత్రమే. రెండేళ్ల క్రితం నిబంధనల తో కూడిన షరతులతో వాహనాల రాకపోకలను ప్రారంభించిన అధికారులు పలు శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలనే ఈఎన్‌సీ ఆదేశాలను పాటించడం లేదు.

● బాధితులకు అందని సహాయం

ఘాట్‌రోడ్డు పక్కన గల లోయలో ఆర్టీసీ బస్సు పడి 67 మంది మృతి చెందగా మృతుల కుటుంబాలను కదిలిస్తే ఇప్పటికీ వారి కన్నీళ్లు వరదలుగా ప్రవహిస్తున్నాయి. మృతుల్లో 60మందికి పైగ కొడిమ్యాల మండలానికి చెందిన వారే ఉండగా వారికి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పరిహారం అందకపోగా తీవ్ర వేదనకు గురౌతున్నారు. ప్రమాదం అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో పాటు ఆర్టీసీ రూ. 10లక్షలు అందించి చేతులు దులుపుకున్నట్లు బాధిత కుటుంబాలు అంటున్నాయి. క్షతగాత్రులు అయిన అనేక మంది ఇప్పటికీ మంచానికే పరిమితం కాగ కనీసం ప్రభుత్వం అందించే పింఛన్‌కు కూడా నోచుకోవడం లేదు. ప్రభుత్వం మృతుల కుటంబాలకు, క్షతగాత్రులకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఆదుకోవల్సిన అవసరం ఉంది. అయితే ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఆ దశగా చర్యలు తీసుకోవడం లేదని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాం



పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న ప్రమాదకారక బస్సు

● రాణా ముందే ఆర్టీసీ బస్సు..

ఘాట్‌రోడ్డుపై జరిగిన ప్రమాదంలో 67మంది మృతికి కారణమైన ఆర్టీసీ బస్సు మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగ ఇప్పటికీ అలాగే ఉంది. ప్రమాదానికి సాక్షాత్కారంగా నిలుస్తోంది. ప్రమాదం అనంతరం న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. బస్సు రిలీజ్‌కు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో బస్సును తీసుకెళ్లడం లేదు. దీంతో బస్సు పూర్తిగా తుప్పు పట్టిపోతోంది. పైగా ఇది వ్యవసాయ భూములకు వెళ్లే మార్గంలో ఉండడంతో ఈ మార్గంలో నడిచే రైతులు, ఇతరులు బస్సును చూసి నాటి ప్రమాదాన్ని గుర్తు తెచ్చుకుంటున్నారు. బస్సును అక్కడి నుంచి తొలగించాలని పోలీసులను కోరుతున్నారు.



కొండగట్టు ఘాట్‌రోడ్డు

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



సాయిచరణ్



పోచయ్య (ఫైల్)

సారంగాపూర్, సెప్టెంబరు, 10: వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేక మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన యువకుడు జీవితం విరక్తి చెంది మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం పెంబట్ల గ్రామానికి చెందిన తేలు చంద్రయ్య పెద్ద కుమారుడు తేలు సాయి చరణ్(21) డిగ్రీ చదువుతున్నాడు. సాయి చరణ్‌కు తన స్నేహితులతో పాటు హోటల్ మేనేట్‌మెంట్ కోర్సు చేయాలనే బలమైన కోరిక ఉండేది. అందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డు వచ్చాయి. ఆ కోరిక నెరవేరలేదని మనస్థాపానికి గురై వారం రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన తల్లితండ్రులు చికిత్స నిమిత్తం జగిత్యాలలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. మళ్లీ కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. చరణ్ తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శివంగాలపల్లిలో వృద్ధుడు..

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి గ్రామంలో సోమవారం వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన మక్కపల్లి పోచయ్య (80) అనే వృద్ధుడు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం చేయించినప్పటికీ నయం కాకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు మక్కపల్లి పరుశురాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరు..

కరీంనగర్ క్రైం: బొమ్మకల్ గ్రామ పరిధిలోని హుస్సేనిపురకు చెందిర ఎండీ అక్బర్ (50) మంగళవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. కాగా అక్బర్‌కు దూరంగా పుట్టింటిలో ఉంటున్న అతడి మొదటి భార్య మున్నాబీ తన భర్త మరణంపై అనుమానాలున్నాయని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అక్బర్‌కు మున్నాబీతో వివాహం జరగగా వారికి ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు. 6 నెలల కిందట భర్త కొట్టడంతో కూతుళ్లతో కలిసి పుట్టిళ్లు మేడిపల్లిలో ఉంటోంది. మొదటి భార్యకు తెలియకుండానే మరొక మహిళను వివాహం చేసుకుని కాపురం చేస్తున్నాడని, ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా తనకు సమాచారం అందించారని తెలిపారు. ఇంటికి వెళ్లి చూడగా చనిపోయాడని మొదటి భార్య మున్నాబీ ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త ఆత్మహత్యపై అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 10 : పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి రూ.5,030 నగదు, 6 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని బసంత్‌నగర్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

మంథని, సెప్టెంబర్ 10: మున్సిపల్ పరిధిలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇనుముల సత్యనారాయణ అనే వ్యక్తిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మందల మల్లారెడ్డి అనే వ్యక్తిని ఇనుముల సత్యనారాయణ రూ.5లక్షలు ఇవ్వాలని బెదిరించాడు. రెండు లక్షలు తీసుకొని మిగితా 3లక్షల కోసం గన్‌మెన్ అడ్డుపెట్టుకొని బెదిరింపులకు పాల్పడ్డాడు. మల్లారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో సైతం అనేక మందిని ఇలానే బెదిరింపులకు గురి చేసి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిశాడని ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

రేషన్ షాపులో బెదిరింపులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 10: గోదావరిఖని పైవింక్లయిన్‌లోని ఒక రేషన్‌షాపులో సోమవారం రాత్రి కొత్తపల్లి శివచరణ్ అనే వ్యక్తి చొరబడి తాను విలేకరినని, క్వింటాలున్నర బియ్యం కావాలంటూ బెదిరింపులకు పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. రాత్రి షాపులోకి వెళ్లి శివచరణ్ నిర్వాహకుడు శివరాత్రి సురేష్‌తో బియ్యం గురించి గొడవ పెట్టుకున్నాడన్నారు. తన వద్ద అంత బియ్యం లేవని సురేష్ పేర్కొనగా శివచరణ్ కోపంతో తాను పత్రికా విలేకరినని, బియ్యం ఇవ్వవా అంటూ మిషన్‌ను ధ్వంసం చేశాడని, అడ్డువెళ్లిన శివరాత్రి సురేష్‌పై దాడి చేశాడని, బియ్యం ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడని సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా సభ్యుల అరెస్టు

● 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. డబ్బులు సులువుగా సంపాదించాలన్న ఆలోచనతో కొందరు ముఠాగా ఏర్పడి అంతరాష్ట్ర స్థాయిలో గంజాయి రవాణాకు పాల్పడడానికి నిర్ణయించుకున్నారు. ఆంధ్ర - ఒరిస్సా సరిహద్దు గ్రామాల నుంచి అక్రమంగా గంజాయిని తీసుకవచ్చి విక్రయిస్తున్నారు. జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూరు గ్రామానికి చెందిన ఎడమలపల్లి సాయి కుమార్, తుడుం సాయితేజ, కందుల అరుణ్, గౌరాపూర్ గ్రామానికి చెందిన ఎడపల్లి సాకేత్, జగిత్యాల మండలం దరూర్ గ్రామానికి చెందిన పాల రాజుకుమార్‌లను గంజాయి వ్యవహారంలో కొడిమ్యాల మండలం పూడూరు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆంధ్రా- ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి పెట్టుబడి పెట్టి తక్కువ ధరలో గంజాయిని కొనుగోలు చేసి పూడూరుకు తరలించారన్నారు. గంజాయిని ముఠా సభ్యులు పంచుకోవడా నికి ప్రయత్నిస్తున్న తరుణంలో పక్కా సమాచారం మేరకు కొడిమ్యాల, మల్యాల సర్కిల్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్రవాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంఘటనలో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కొడిమ్యాల ఎస్ఐ సందీప్, హెడ్ కానిస్టేబుల్ రాజయ్య, కానిస్టేబుల్స్ తిరుమల్ రాజు, వినోద్, మల్యాల సీఐ నీలం రవి, డీఎస్పీ రఘు చందర్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించి నగదు రివార్డు అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

బంగారు గొలుసు దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

జ్యోతినగర్, సెప్టెంబరు 10: ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 8న జరిగిన దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ నెల 1న లూర్దునగర్‌లో నివసిస్తున్న దొవతిరెడ్డి ప్రతాపరెడ్డి ఇంటి ముందు ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు హారన్ కొట్టారు. దీంతో ప్రతాప్ రెడ్డి బయటకు వచ్చి ఎందుకు హారన్ కొడుతున్నారని అడిగే ప్రయత్నంలో ఆటోలోని ముగ్గురు వ్యక్తులు ఆయన మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. దోపిడీ విషయాన్ని ప్రతాపరెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఎన్‌టీపీసీ మెటీరియల్ గేట్ వద్ద ఆటోలో వెళ్తున్న ముగ్గురు నిందితులు గోదావరిఖనికి చెందిన ఆతుకూరి శ్రీనివాస్, బెజ్జంకి పృథ్వీరాజ్, రేణిగుంట రవితేజను అరెస్టు చేసినట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి అపహరణకు గురైన రెండున్నర తులాల బంగారు గొలుసు, చోరీకి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు.

ఉచిత విద్య అందించడంలో ప్రభుత్వాలు విఫలం

● పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 10: ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంగిడికుమార్, ముల్కల తిరుపతి విమర్శించారు. మంగళవారం నగరంలో ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 30న జార్జిరెడ్డి యాభై సంవత్సరాల సభను విజయవంతం చేయాలన్నారు. భారత విప్లవ విద్యార్థి ఉద్యమ చరిత్రలో పీడీఎస్‌యూ ప్రత్యేక చరిత్ర కలిగి ఉన్నదన్నారు. శాస్త్రీయ విద్యా విధానం కోసం జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్, శ్రీపాదశ్రీహరి, కోల శంకర్, దుస్స చేరాలు, బొమ్మ సాంబయ్య, రంగవల్లి, మారోజు వీరన్న లాంటివీరులు అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు కెస్వప్న, లోకిని రమేష్, రాజశేఖర్, వర్షిని, శైలజ, రజనీకాంత్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సైదాపూర్, సెప్టెంబరు 10: సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి, ఘన్‌పూర్ గ్రామాలలో అక్రమంగా నిల్వ ఉంచిన 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటింటికి తిరిగి రేషన్‌బియ్యం పోగుచేసి ఒకదగ్గర ఉంచి అక్కడి నుంచి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు వెన్కేపల్లి, ఘన్‌పూర్ గ్రామాలలో తన పోలీస్ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేయగా రెండు గ్రామాలలో వేరువేరు చోట్ల అక్రమంగా నిలువ ఉంచిన 22క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించినట్లు తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకొని, వాటిని అక్రమంగా నిలువ ఉంచిన చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన పెద్ద భత్తుల కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తిరుపతి హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్

● ఆలయ విస్తరణకు ఏర్పాట్లు చేయాలని సూచించిన సీఎం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 10: శృంగేరి జగద్గురు ఇచ్చిన మహా ప్రసాదం, శృంగేరి పరంపర చిత్రపటాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం అందజేశారు. శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ పనులను ప్రారంభించడానికి శృంగేరి పీఠం వారి అనుమతులకు ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎంవో వేముల శ్రీనివాసుల బృందం సోమవారం శృంగేరి పీఠంను సందర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్‌బాబు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు రాధాకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జగద్గురు భారతి తీర్థ మహాస్వాముల వారు, పీఠాధిపతి విధిశేఖర భారతి స్వాముల వారు ఇచ్చిన మహాప్రసాదాన్ని అందేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఆలయ విస్తరణ పనులపై సలహాలను, సందేహాలు నివృత్తి చేసిన తీరును వివరించారు. ఆలయ విస్తరణకు తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సంబంధిత అధికారులకు సీఎం సూచించారు.



సీఎంకు చిత్రపటాన్ని అందజేస్తున్న మంత్రులు, ప్రభుత్వ విప్

జమ్మికుంటలో సీఐడీ విచారణ

● ఆసుపత్రిలో సీఎంఆర్‌ఎఫ్ బిల్లులు తనిఖీ చేసిన అధికారులు

జమ్మికుంట, సెప్టెంబర్ 10: జమ్మికుంట పట్టణంలోని పాత అంబేద్కర్ చౌరస్తాలో గల సప్తగిరి ఆసుపత్రిలో జరిగిన సీఎమ్‌ఆర్‌ఎఫ్ బిల్లుల అక్రమాలపై తెలంగాణ సీఐడీ పోలీసులు మంగళవారం విచారణ చేపట్టారు. ఇదే ఘటనపై ఏడాది క్రితం అధికారులు ఆసుపత్రిలో తనిఖీలు జరిపారు. ఆగస్టు 26న సీఐడీ పోలీస్‌లు ఆసుపత్రికి వచ్చారనే సమాచారం అందుకున్న మీడియా అక్కడకు పెద్ద ఎత్తున చేరుకుంది. కానీ సీఐడీ అధికారులు ఎవరు అటువైపు రాలేదు. మంగళవారం కూడా సీఐడీ అధికారులు విచారణకు వచ్చారనే విషయం తెలుసుకున్న మీడియా ఆసుపత్రికి చేరుకుంది. అప్పటికే సీఐడీ అధికారులు వెళ్లిపోయారు. సప్తగిరి ఆసుపత్రి నుంచి ఒకే ఐడిపై రెండు సీఎమ్‌ఆర్‌ఎఫ్ బిల్లులు సృష్టించారు. ఫేక్ బిల్లులను గుర్తించిన అధికారులు ఆసుపత్రిపై కేసు నమోదు చేశారు. గతంలో ఆసుపత్రిలో పనిచేసిన సంతోష్ అనే వ్యక్తి బిల్లులు తయారు చేశాడని వైద్యుడు వంశీకృష్ణ ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా సీఐడీ పోలీస్‌లు సదరు వ్యక్తితో పాటు వైద్యుడిని విచారించారు. ఫేక్ సిఎమ్ ఆర్‌ఎఫ్ బిల్లులు ఎందుకు తయారు చేశారు... ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందని ప్రశ్నించారు. బిల్లులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆ ఫేక్ బిల్లులు ఎలా వచ్చాయో తనకు తెలియదని, బిల్లులపై ఉన్న సంతకం కూడా తనది కాదని వైద్యుడు సమాధానం ఇవ్వగా, అసలు ఆ బిల్లుల సంగతే తనకు తెలియదని సంతోష్ తెలిపాడు. సీఐడీ పోలీస్‌లు మాత్రం బిల్లులకు సంబంధించిన పలు రికార్డులు, పెన్‌డ్రైవ్‌లు తీసుకువెళ్లారు.

● సీఎమ్‌ఆర్‌ఎఫ్ బిల్లుల అక్రమాలపై అనుమానాలెన్నో?

సీఎమ్‌ఆర్‌ఎఫ్ బిల్లుల కోసం ఆసుపత్రి నుంచి చాలా పత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటికీ వైద్యుడికి సంబంధం లేకుండా బయటి వ్యక్తి తయారు చేయడం సాధ్యమేనా అన్న విషయంపై చర్చ జరుగుతోంది. సీఎం ఆర్‌ఎఫ్ కోసం ఆసుపత్రి నుంచి ఎమర్జెన్సీ సర్టిఫికెట్, ఎసెన్షియల్ సర్టిఫికెట్, డిశ్చార్జ్, ఇన్ పేషెంట్ ఐపి, ఇన్వెస్టిగేషన్, ఫార్మసీ, ల్యాబ్ తదితర బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. వీటన్నింటినీ ఆసుపత్రిలో పనిచేసే ఒక వ్యక్తి తయారు చేయడం సాధ్యం కాదనే చర్చ జరుగుతోంది.

ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి అనుకూలం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కరేనని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగార్డెన్‌లో ఎస్సీ వర్గీకరణపై సదస్సు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు మాత్రమే ఇచ్చిందని, ఇంకా వర్గీకరణ అమలు కావాల్సి ఉందన్నారు. ఎస్సీ వర్గీకణ విషయంలో గత ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. ఈ అంశంలో బీజేపీకి ఓటేయాలని మందకృష్ణ చెప్పినా అత్యధిక మాదిగలు కాంగ్రెస్‌కే ఓటు వేశారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇప్పటివరకు కేవలం మన సీఎం రేవంత్‌రెడ్డి మాత్రమే చెప్పారని, బీజేపీ పాలిత ప్రాంత రాష్ట్రాల ముఖ్యమం త్రులు కాని, కేంద్రం కానీ ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో భారీ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

ఆస్తిలో వాటా కోసం భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

ఓదెల, సెప్టెంబరు 10: భర్త ఆస్తిలో వాటా కోసం మండలంలోని కొలనూర్‌లో మంగళవారం జంగ సంజీవరెడ్డి అనే వ్యక్తి ఇంటి ఎదుట అతడి భార్య వనజ, కూతురు శ్రీవర్ష బైఠాయించారు. బాధితురాలు విలేకరులతో మాట్లాడుతూ, సంజీవరెడ్డి మొదటి భార్య గతంలో మృతిచెందగా రెండో భార్యగా వీణవంక మండలం చల్లూర్‌కు చెందిన తనను వివాహం చేసుకున్నాడని తెలిపారు. కొద్ది రోజులైన తర్వాత ఆడపిల్లలు పుట్టారని చితకబాదుతూ చిత్రహింసలకు గురి చేసి ఇంటి నుంచి వెళ్లగొట్టారని, దీంతో తన తల్లి దగ్గర ఇద్దరు కూతుర్లతో బతుకుతున్నానని వనజ తెలిపారు. అనంతరం మరో మహిళను తీసుకువచ్చి కాపురం పెట్టాడని మూడో భార్యకు ఒక కుమారుడయ్యాడని తెలిపారు. మూడవ భార్య కుమారునికి 5 ఎకరాల భూమి పట్టా చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే ఇక మిగిలిన 6 ఎకరాల్లో మూడు ఎకరాల భూమిని తన కూతుర్లకు పట్టా చేయాలని డిమాండ్ చేశారు. ఇది పరిష్కారం అయ్యేవరకు ఇక్కడి నుంచి వెళ్లనని, అధికారులు స్పందించి, నా ఇంటిలో స్థానం కల్పించాలని డిమాండ్ చేసింది. ఇంటి ముందు భార్య, కూతురు బైఠాయించడంతో ప్రస్తుతం ఇంటికి తాళం వేసి సంజీవరెడ్డి, ఇతని మూడో భార్య, ఇద్దరు వృద్ధులు ఇక్కడి నుంచి పరారీ అయ్యారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 10: వ్యవసాయ మార్కెట్ ఎదురుగా రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

చిరుత దాడిలో గొర్రె మృతి

చందుర్తి, సెప్టెంబర్ 10: చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం చిరుత పులి దాడిలో ఓ గొర్రె మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దోకె రాజయ్య అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రెపై కొత్తకుంట సమీపంలో కర్షల బోరు వద్ద చిరుత పులి దాడి చేయడంతో గొర్రె మృతి చెందింది. గతంలో కూడా ఈ ప్రాంతంలో చిరుత దాడికి ఓ మేక మృతి చెందినట్లు తెలిపారు. చిరుతపులి దాడితో పశువుల కాపర్లు, రైతులు, గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

రూ. 2.26 కోట్లకు కుచ్చుటోపీ.. పరారీలో వ్యాపారి

చిగురుమామిడి,స్టెంబరు 10: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ప్రవీణ్‌కుమార్ అనే వ్యాపారి ఇదే గ్రామానికి చెందిన రైతులు, ఇతర ప్రైవేట్ వ్యక్తులు 98 మందికి 2.26 కోట్ల రూపాయల కుచ్చు టోపీ పెట్టిన వ్యాపారి పరారీలో ఉన్నాడు. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని సంవత్సరాలుగా అడ్తి వ్యాపారం చేస్తూ అనేక మందికి నమ్మకంగా ఉండేవాడు. తిమ్మాపూర్ మండలం రేణికుంట, మొగిళిపాలెం, పర్లపల్లి, బెజ్జంకి మండలం దేవక్కపల్లి, ఇదే మండలం రేకొండ , సిద్దిపేట పట్టణానికి చెందిన వ్యక్తులు వరి ధాన్యం వ్యాపారికి విక్రయించారు. తమ వద్ద ఉన్న డబ్బులను కూడా అతనికి వడ్డీకి ఇచ్చారు. నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని 2 కోట్ల 26 లక్షల రూపాయాలకు ఎగనామం పెట్టి వ్యాపారి పరారీ అయ్యాడు. వ్యాపారికి ధాన్యం, డబ్బులు ఇచ్చిన వారు ఆందోళనకు గురయ్యారు. వ్యాపారిపై జిల్లా పోలీస్ కమిషనర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇందులో కొంత మంది తమ కూతుళ్ల వివాహాలకు, మరికొంత మంది పిల్లల చదువుల కోసం, అనేక మంది తమ డబ్బు భద్రంగా ఉంటుందని వ్యాపారి వద్ద పెట్టినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20 సంవత్సరాల క్రితం మూతపడిన అయిల్ మిల్లులో తాను చేసిన వ్యాపారంలో నష్టం వచ్చిందని సదరు వ్యాపారి ప్రవీణ్‌కుమార్ కోర్టును సంప్రదించి తమకు నోటీస్ పంపించారని బాధితులు అంటున్నారు. సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ప్రవీణ్‌కుమార్ ఇంటికి తాళం వేసి ఉన్నదని గ్రామస్థులు తెలిపారు. వ్యాపారి సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ ఉందని అంటున్నారు. వ్యాపారికి ఇద్దరు కుమారులు, భార్య ఉంది.

కరీంనగర్ ప్రజలపై ఎందుకంత వివక్ష

-మంత్రి పొన్నంకు మేయర్ సునీల్‌రావు సూటి ప్రశ్న


మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 10: కరీంనగర్ ప్రజలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎందుకంత వివక్షో చెప్పాలని మేయర్ సునీల్‌రావు ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో నగరంలో అభివృద్ధి పరుగులు పెడితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పనులు ఎందుకు నిలిపోయాయో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంత్రివా.. లేక కరీంనగర్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రివా స్పష్టం చేయాలని పొన్నం ప్రభాకర్‌ను డిమాండ్ చేశారు. మూడు నెలలక్రితం పాలకవర్గానికి సమాచారమివ్వకుండా మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించినా నగర ప్రజలకు ఏమైనా ప్రయోజనం కలిగిందా అని మేయర్ ప్రశ్నించారు. అభివృద్ధికి నిధులు తీసుకురావడం చేతకాకుంటే సమీక్షలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌పై కేంద్ర మంత్రి 'బండి' వ్యాఖ్యలు సరికాదు

-బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్


మాట్లాడుతున్న చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 10: బీఆర్ఎస్ ఔట్ డేటెడ్..ఆ పార్టీకి ప్రజలు నో ఎంట్రీ బోర్డు పెట్టారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడటం సరికాదని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఖండించారు. తెలంగాణ తెచ్చింది బీఆర్ఎస్ పార్టీ అని, రాష్ట్రం ఏర్పడకుంటే నీవు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడివి, కేంద్రమంత్రివి అయ్యేవాడివా ఒక్కసారి ఆలోచించుకోవాలని సంజయ్‌కి సూచించారు. మంగళవారం బీఆర్ఎస్ నగరశాఖ కార్యాలయంలో మీడియా సమావేశంలో హరిశంకర్ మాట్లాడుతూ ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలుండి తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు షౌకత్ అలీ, వాజిద్, బోనకుర్తి సాయికృష్ణ, నవాజ్, ఆరె రవిగౌడ్, మిడిదొడ్డి నవీన్‌కుమార్, చేతి చంద్రశేఖర్, జెల్లోజి శ్రీనివాస్, గూడెల్లి రాజ్‌కుమార్, ఇర్ఫాన్, సత్తినేని శ్రీనివాస్, నయీమ్, నదీమ్, నవీన్, సంపత్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాల్లో ప్రత్యేక పూజలు


విద్యారణ్యపురిలో పూజ చేస్తున్న రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 10:వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్‌లోని పలు మండపాలను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తీగలగుట్టపల్లి, సరస్వతి నగర్, విద్యారణ్యపురి రోడ్ నెంబర్-1, శాస్త్రి రోడ్, ప్రకాశం గంజ్, టవర్ సర్కిల్, బోయవాడ, భగత్‌నగర్ సర్కిల్, కిసాన్‌నగర్ తో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ మాచర్ల ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు వంగల విద్యాసాగర్, పోరండ్ల రమేష్, సిటీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి, 48వ డివిజన్ అధ్యక్షులు గంగుల దిలీప్ కుమార్, మార్క రాజు, మాడిశెట్టి కిషన్, కట్ల జగన్, పాల్తేపు కిషన్, కీర్తి శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్' జాబ్‌మేళాకు స్పందన

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 10: నగరంలోని జ్యోతిబాపూలే మైదానంలో డాక్టర్ ఖాన్ లక్ష్ పౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు చక్కటి స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన 4,921 మంది నిరుద్యోగ యువతీ, యువకులు ఈ జాబ్‌మేళాకు హాజరుకాగా 416 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు లక్ష్ పౌండేషన్ చైర్మన్,లక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ డాక్టర్ ముస్తాక్ అలీఖాన్ తెలిపారు.విద్యార్థులు, యువతీయువకులకు మరింత చేయూతనిచ్చి వారికి ఉజ్వల భవిష్యత్ కల్పించాలనే లక్ష్యంతో వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుల ఇంటర్వ్యూలకు ఆహ్వానం

జమ్మికుంట, సెప్టెంబర్ 10: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి తెలుగు, బాటనీ, డైరీ సైన్స్ సబ్జెక్టులు బోధించుటకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 12న ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గణపతి మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

చొప్పదండి, సెప్టెంబర్ 10: వినాయక మండపాల వద్ద నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ ప్రకాష్ అన్నారు. మంగళవారం చొప్పదండి పోలీసుస్టేషన్‌లో గణపతి మండప నిర్వాహకులతో అయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక మండపానికి దగ్గరలో విద్యుత్తు వైర్లు ఉంటాయని, నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలన్నారు. నిమజ్జనం చేసేటప్పుడు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. .ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అనూష, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

గన్నేరువరం, సెప్టెంబర్ 10: ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాలలో వృద్ధుల కోసం మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 50 ఏళ్లు పైబడిన వృద్ధులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, నడుంనొప్పి, అర్షమొలలు వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్‌సాగర్, జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రవీణ్‌కుమార్, ఫార్మాసిస్ట్ అనిల్, సుధాకర్, ఎఫ్ఎన్‌వో సుమలత తదితరులు పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

రామడుగు, సెప్టెంబరు 10 : ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ క్షేత్రాల్లో నీళ్లు చేరి ఉంటాయని, రైతులు వ్యవసాయాధికారుల సూచనలకనుగుణంగా సాగు పనులు చేపడితే ఇబ్బందులు ఉండవని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మీ అన్నారు. మంగళవారం రామడుగు మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో రైతులకు సూచనలు చేశారు. రుణమాఫీ పథకంలో భాగంగా రేషన్ కార్డు లేని రైతుల కుటుంబాల నిర్ధారణ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చొప్పదండి డివిజన్ సహాయ సంచాలకులు ప్రియదర్శిని, మండల వ్యవసాయాధికారి ప్రభావతి పాల్గొన్నారు.

16న వినాయక నిమజ్జనం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 10: నగరంలో ఈనెల 16న వినాయక నిమజ్జనం ఉంటుందని వీహెచ్‌పీ, హిందూ ఉత్సవ సమితి నాయకులు తెలిపారు. నగరంలోని పలు మండపాల్లో ఏర్పాటు చేసి వినాయకులను వీహెచ్‌పీ, హిందూ ఉత్సవ సమితి నాయకులు మంగళవారం సందర్శించారు. పూజల అనంతరం నిత్యం పూజలు చేసే వైదికులు, నిర్వాహకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టవర్ వద్ద వినాయక మూర్తులకు స్వాగతం పలుకుతామని, 16న నిమజ్జనం అవుతుందని స్పష్టం చేశారు. మండపాల వద్ద కరెంట్, ఫైర్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు తాటి ఈశ్వర్, విహెచ్‌పి రాష్ట్ర సేవా ప్రముఖ్ కోమల్ల రాజేందర్‌రెడ్డి, గోరక్షా విభాగ్ బాధ్యుడు పుట్కూరి రాధాకృష్ణారెడ్డి, ఆదిమూలం విద్యాసాగర్, ఇనుగుర్తి రమేశ్, గర్రెపల్లి ఆంజనేయులు, వంగల ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగత్‌నగర్‌లో మేయర్ పూజలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 10: నగరంలోని భగత్‌నగర్ 33వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన పలు మండపాల్లో వినాయకులను మేయర్ సునీల్‌రావు మంగళవారం పూజలు చేసి అన్నదానాల్లో పాల్గొన్నారు. పోలీస్ క్వార్టర్స్, భగత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆయా మండపాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

డెయిరీ నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించండి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 10: కరీంనగర్ డెయిరీ నుంచి వెలువడే వ్యర్థాలు భూమిలో, నీటిలో, గాలిలో కలువడంతో దుర్వాసనతో పాటు వాతావరణం కాలుష్యంగా మారి అనారోగ్యాలకు గురవుతున్నామని, సమస్యలను పరిష్కరించాలని 16వ డివిజన్ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్‌తో పాటు ఆ కాలనీ ప్రజలు డెయిరీ యాజమాన్యాన్ని కోరారు. మంగళవారం వారు డెయిరీ ఎండీని కలిసి డెయిరీ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పడుతున్న ఇబ్బందులతోపాటు వాటిని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



మన్నెంపల్లిలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, కరీంనగర్‌లో సీపీఐ నివాళి

కరీంనగర్‌టౌన్, సెప్టెంబరు 10: చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఐలమ్మ చిత్రపటానికి కలెక్టర్ పమేలా సత్పతి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

●**భగత్‌నగర్:** నగరంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి సీపీఐ ఆధ్వర్యంలో పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకట స్వామి, కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పాల్గొన్నారు.

●నగరంలోని ఐలమ్మ విగ్రహానికి సీపీఎం నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, గుడికందుల సత్యం, బీమా సాహెబ్, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

●బీజేపీ నాయకులు ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు కొట్టెమురళీకృష్ణ, ఉప్పరపల్లి శ్రీనివాస్, బండ రమణారెడ్డి, నాగసముద్రం ప్రవీణ్‌కుమార్, కరండ్ల మధూకర్ పాల్గొన్నారు.

●**కరీంనగర్ కల్చరల్:** నగరంలోని కలెక్టరేట్ రోడ్‌లో గల చాకలి ఐలమ్మ చౌక్‌లో తెలంగాణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విగ్రహానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ హైదరాబాద్ టాంక్‌బండ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా విగ్రహాన్ని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పూసాల శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ మునిగంటి అశ్విన్, మల్లేశ్‌కుమార్, రాజయ్య, శ్రీనివాస్, శంకర్, శివ, వేంకటేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

●**గణేశ్‌నగర్:** చాకలి ఐలమ్మ ఉద్యమస్ఫూర్తిగా కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గంలో బీసీ అభ్యర్థులకే అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెకె పెద్ది శ్రీధర్‌రాజు పిలుపునిచ్చారు. బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ మియాపూర్ రవీంద్ర చారి, బీసీ నాయకులు గరిక కోటేశ్వర్, సాయి, రాజు, రమేష్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఎదుట చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. పట్టణంలోని గ్రంథాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కమిషనర్ సమ్మయ్య, సుమన్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, శంకర్, వెంకటేశ్వర్లు, సాయికృష్ణ, రాము, శ్రీధర్, నాగరాజు, ప్రతాప రాజు పాల్గొన్నారు.

●**శంకరపట్నం:** ఐలమ్మ వర్ధంతిని మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి నివాళులర్పించారు.

●**ఇల్లందకుంట:** మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ కూడలి వద్ద రజక సంఘం మండలాధ్యక్షుడు రావుల ఎల్లయ్య ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ కొంరెల్లి, మాజీ ఎంపీటీసీ కుమార్, మాజీ సర్పంచ్ కంకణాల శ్రీలత-సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

●**సైదాపూర్:** మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సోమారపు రాజయ్య, మునిగంటి సంతోష్, సమ్మయ్య పాల్గొన్నారు.

●**తిమ్మాపూర్:** మండలం వ్యాప్తంగా ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. మన్నెంపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు.

●**చిగురుమామిడి:** మండలంలోని అన్ని గ్రామాల్లో, మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. రేకొండ గ్రామంలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దుడ్డెల లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, గౌడ గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిగౌడ్, ఎలగందుల రాజయ్య పాల్గొన్నారు.

●**రామడుగు:**గోపాల్‌రావుపేటలో శివగంగ మండేల్ రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పైండ్ల హనుమంతు, ఉపాధ్యక్షులు లింగంపల్లి అంజయ్య ప్రధాన కార్యదర్శి పైండ్ల తిరుపతి పాల్గొన్నారు.

●**గంగాధర:** గంగాధర మండలంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

కరీంనగర్ అర్బన్, సెప్టెబంరు 10: నూతన టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌కుగౌడ్‌ను మంగళవారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సుడా చైర్మన్, ఇతరనాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో మహేష్‌కుమార్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మణ్ కుమార్, విజయరమణా రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లాహుస్సేన్, నాయకులు అన్నయ్య గౌడ్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్‌వీజేసీలో కంటి వైద్య పరీక్షలు

కరీంనగర్‌టౌన్, సెప్టెంబరు 10: శ్రీ వెంకటేశ్వర బాలకల జూనియర్ కళాశాలలో శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషలిటీ వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని కళాశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్ రెడ్డిలు ప్రారంభించారు.

దుకాణాలకు వేలం పాట

కరీంనగర్‌టౌన్, సెప్టెంబరు10: జిల్లా కేంద్రములోని సమీకృత మార్కెట్ (ఇంటిగ్రేటెడ్ మార్కెట్) వీక్లీ మార్కెట్ ఏరియాలో గల మూడు దుకాణాలను అద్దె ప్రాతిపదికన వేలం పాట ద్వారా కేటాయించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. సమీకృత మార్కెట్ (ఇంటిగ్రేటెడ్ మార్కెట్) వీక్లీ మార్కెట్ ఏరియాలో (3)దుకాణాల కొరకు ఎవరైనా వేలం పాటద్వారా అద్దెకు తీసుకొనవచ్చు. వేలం పాట ద్వారా ఎక్కువ అద్దె చెల్లించుటకు సిద్ధంగా ఉన్నవారికి మూడు దుకాణాలను కేటాయించబడును అన్నారు. దుకాణముల కేటాయింపులో రిజర్వేషన్ కూడా పాటించబడును. దరఖాస్తులు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు పొందవచ్చన్నారు.

ఫిరాయింపులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్, హరీష్‌రావు, బీఆర్ఎస్ నాయ కులకు లేదని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ రాజకీయాలను భ్రష్టు పట్టించిదని విమర్శించారు. కోర్టు హైకోర్టు తీర్పును అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. ఈ సంస్కృతి కేసీఆర్ నుంచే వచ్చిందన్నారు. అందుకే ఈ విషయంపై మాట్లాడే అర్హత కేసీఆర్, కేటీఆర్ బిఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. అవసరమైతే డివిజన్ బెంచ్, కాకుంటే సుప్రీం కోర్టును ఆశ్రయించే అవకాశం ఉందన్నారు. గతంలో కాంగ్రెస్, సీపీఐ, వైసీపీ, టీడీపీ నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేర్చుకుందని, అవన్ని దాచిపెట్టి, ఇపుడు నీతులు వల్లిస్తుందని మండిపడ్డారు. ఈ విషయంలో న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేదల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

భగత్‌నగర్, సెప్టెంబరు 10: పోలీస్ కమిషనర్ పేదల పక్షాన మరో ముందడుగు వేసి వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. మంగళవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి అధికార యంత్రాంగం పట్ల ఏమాత్రం పట్టు లేదన్నారు. అధికార యంత్రాంగంపై పట్టు సాధించి ప్రజలకు మేలు చేయాలన్నారు. కరీంనగర్‌లో సీపీపై అధికార పార్టీ దళిత ఎమ్మెల్యే అసహనాన్ని వెలిబుచ్చిన సంఘటన జిల్లాలో చర్చనీయాంశ మైందన్నారు. దళిత బలహీనవర్గాల అధికారుల పట్ల కక్షసాధింపు చర్యలకు పాల్పడ వద్దన్నారు. కొంత మంది పోలీస్ అధికారుల అవినీతి అక్రమాలు విచ్చల విడిగా కొనసాగు తున్నాయని ఆరోపించారు. వారిపై పర్యవేక్షణ కొరవడిందని, సీపీ పేరు చెప్పుకొని అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కసిరెడ్డి మణికంఠరెడ్డి, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, పైడిపల్లి రాజు, బామండ్లపల్లి యుగంధర్, బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగంలో దేశం ఎంతో అభివృద్ధి


పోరండ్లలో పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న కవ్వంపల్లి, కొండూరి


లక్ష్మీపూర్‌లో పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న నాయకులు

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, సెప్టెంబరు10: సహకార రంగంలో దేశం చాలా అభివృద్ధి చెందిందని, వ్యవసాయాన్ని నమ్ముకుంటే ఎప్పటికైనా అభివృద్ధిలోకి వస్తారని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పోరండ్లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్, డీజిల్ బంక్ పునఃప్రారంభోత్సవం కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా సహకార బ్యాంకు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. సంఘం ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కరీంనగర్ సహకార సంఘం ఒక రైతుకు 60లక్షల రూపాయల వరకు అప్పు ఇచ్చే బ్యాంకుగా అభివృద్ధి చెందిందని కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. దీనికి రైతుల సహకారం ఎంతో ఉందన్నారు. రైతులు బ్యాంకు నుంచి తీసుకున్న ఋణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని బ్యాంకుకు రైతులే యాజమానులు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోరండ్ల సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, డీసీవో రామంజ చార్యులు, డైరెక్టర్లు తిరుపతి రెడ్డి, గోపు మల్లారెడ్డి, అంజిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, కుమార్, సీఈవో చొక్కారెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలో క్యాంప్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం దోమలు, ఈగలు వ్యాపించే అవకాశం ఉందని ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

మానకొండూర్ : పేదలకు వరం సీఎం రిలీఫ్‌ఫండ్ అని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మండలంలో 74 మందికి రూ. 17లక్షల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్, డీసీసీ అధికార ప్రతినిధి కొత్తకొండ శంకర్, మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రాచారి నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కేంద్రం చేయూత

- కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

మానకొండూర్: దేశంలోని సహకార సంఘాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి చేయూతనిస్తుందని కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని ఊటూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపూర్‌లో నూతనంగా పెట్రోల్ బంకు, ఊటూర్‌లో రెండు వేల మెట్రిక్ టన్నుల గోదాంను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సహకారంతోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 42 సహకార సంఘాలు బలోపేతం అయినట్లు తెలిపారు. ఊటూర్‌లో కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా 300 రకాల సేవలు అందిస్తుందన్నారు. జనరిక్ మందుల విక్రయంతో ప్రజలకు సేవలందించడం జరుగుతుందన్నారు. రెండు వేల మెట్రిక్ టన్నుల గోదాం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, నోడల్ అధికారి రాజమౌళి, ఊటూర్, గట్టుదుద్దెనపల్లి, వేములవాడ సింగిల్‌విండో అధ్యక్షులు ముద్దసాని ప్రదీప్‌రెడ్డి, రాధాకిషన్‌రావు, తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఎడ్ల సతీష్, సీఈవో స్వామిరెడ్డి, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

హుజూరాబాద్, సెప్టెంబరు 10: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎర్రబెల్లి సంపత్‌రావు పాల్గొని సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో పైళ్ల వెంకట్‌రెడ్డి, మేరుగు రాజిరెడ్డి, యాంసాని శశిధర్, గూడూరి సత్యనారాయణరెడ్డి, శేషయ్య, జెల్ల సుధాకర్, ముత్యంరావు, రాజశేఖర్, కొలిపాక శ్రీనివాస్, ప్రభాకర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్ : మానకొండూర్‌లో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఉపాధ్యక్షుడు రంగు బాస్కరాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మండలంలో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పూదరి రమణగౌడ్, సొన్నాకుల శ్రీనివాస్, నందగిరి బలరాం, మాచర్ల కోటేశ్వర్, మీస రమణయ్య, శ్రీనివాస్‌రమేశ్, వరప్రసాద్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో మహిళ అరెస్ట్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10: కరీంనగర్ మార్కెట్ ప్రాంతంలో మహిళల పర్సులు, సెల్‌ఫోన్‌లను దొంగిలిస్తున్న మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన లక్ష్మీ అనే మహిళను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ జె సరిలాల్ తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే కరీంనగర్ మార్కెట్ ప్రాంతంలో కూరగాయాలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ముగ్గురు మహిళల పర్సులను, మొబైల్‌ఫోన్‌లను ఇటీవల దొంగిలించిన సంఘటనపై బాధితులు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, మహిళను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన మహిళ వద్ద నుంచి 21 వేల నగదు, 5 గ్రాముల బంగారం, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

స్టాఫ్ క్లబ్ సెక్రటరీగా శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక



గణేశ్‌నగర్, సెప్టెంబరు 10: శ్రీ రాజరాజేశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్టాఫ్ క్లబ్ సెక్రటరీగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్ డాక్టర్ మల్లారం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉమారాణి తెలిపారు. ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్ రమేష్ బాబు, డాక్టర్ వి శ్రీనివాస్ వ్యవహరించారు. శ్రీనివాస్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అభినందించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ


క్రీడా దుస్తులు అందించిన రెడ్డవేని మధు

భగత్‌నగర్, సెప్టెంబరు 10: కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ మార్కెట్ చైర్మన్ రెడ్డవేణి మధు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. తన కూతురు రిత్విన్య పుట్టిన రోజును పురస్కరించుకుని వంద మంది విద్యార్థులకు 60 వేల రూపాయల విలువైన క్రీడా దుస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో పిల్లి మహేష్, కడారి శ్రీనివాస్, సాబీర్, దావకమలమనోహర్, పెంచాల అంజి పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడలు ప్రారంభం

భగత్‌నగర్, సెప్టెంబరు 10: కొత్తపల్లి మండల స్థాయి క్రీడలను మండల విద్యాధికారి ఆంబటి వేణుకుమార్ ప్రారంభించారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో మంగళవారం క్రీడోత్సవాల్లో భాగంగా బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడ అంశాలలో ఎంపిక పోటీలను అండర్-14, అండర్-17, విభాగాలలో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణు గోపాల్, పెటా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి గిన్నె లక్ష్మణ్ పాల్గొన్నారు.

'మంత్రి హోదాలో సమీక్ష నిర్వహించవచ్చు'

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: రాష్ట్ర మంత్రిగా పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష నిర్వహించవచ్చని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో ఎంపీగా గెలిచి నగరానికి ఎంతో సేవ చేశారని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, కరీంనగర్‌కు సంబంధం లేదని మేయర్ సునీల్‌రావు ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిహెచ్ బుచ్చిరెడ్డి, కాశెట్టి శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మాచర్ల ప్రసాద్, ఆసిఫ్ మహ్మద్, హైమద్‌అలి, రోళ్ల సతీష్ కంకణాల అనిల్, ఇమ్రాన్, సర్వర్, చోటు, దేవేందర్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన డీఏవో

గంగాధర, సెప్టెంబరు 10: గంగాధర మండలంలోని పత్తికుంటపల్లిలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి జె భాగ్యలక్ష్మి పరిశీలించారు. అనంతరం గంగాధర రైతు వేదికలో రుణమాఫీలో భాగంగా జరుగుతున్న ఫ్యామిలి గ్రూపింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ప్రియదర్శిని, గంగాధర మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏఈవోలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 10: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన నిమ్మ కుమారస్వామి అనారోగ్యంతో గత నెల 31న మృత్యువాత పడ్డాడు. పట్టణంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో 1993-94సంవత్సరంలో కుమారస్వామితో పదవ తరగతి కలిసి చదువుకున్న తోటి స్నేహితులు అంతా కలిసి రూ.16,300నగదును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మయూరి శ్రీధర్, ఒల్లాల మధు, రవి, సంపత్, సదానందం, రాజేందర్, రాజమౌళి ఉన్నారు.

పాఠశాల క్రీడోత్సవాలు

వీణవంక, సెప్టెంబర్ 10: మండల స్థాయి క్రీడోత్సవాలు ఈ నెల 11,12వ తేదీలలో వీణవంక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

మట్టి గణపతికి ప్రత్యేక పూజలు

రామడుగు, సెప్టెంబరు 10: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మట్టి గణపతిని మంగళవారం అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాఠశాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆహారాన్ని వృథా చేయొద్దు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27: అన్నాన్ని వృథా చేయకుండా ఆకలితో అలమటిస్తున్నవారికి ప్రసాదించాలని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత, కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ అన్నారు. హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన అన్నం పరబ్రహ్మ స్వరూపం...దానిని వృథా చేయడం మహాపాపం అనే పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహేందర్, రాజు, రమణ, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●సుభాష్‌నగర్: మానేర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని అంధుల పాఠశాల, మనోవికాస్ పాఠశాలల్లో విద్యార్థులకు బస్‌పాస్‌లను అందచేశారు. కార్యక్రమంలో గట్టు రాజయ్య, కృష్ణకిషోర్, వేముల విష్ణుమూర్తి, పడమటింటి రమేశ్, ఎండి అక్బర్ పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: హిందూ దేవుళ్ళను కించపరిచే విధంగా వాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు హిందూ సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

●కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ ఆర్టిస్ట్స్ అండ్ ఆర్గనైజర్ క్రికెట్ లీగ్ పోటీ చాంపియన్‌గా సూపర్‌కింగ్స్ జట్టు నిలిచింది. పోటీల విజేతలకు టౌన్ ఏసీపీ నరేందర్, వెంకటరమణారెడ్డి బహుమతి ప్రదానం చేశారు. ఈ పోటీల్లో రన్నరప్‌గా లయన్స్ జట్టు నిలిచింది.